సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 7 । మార్చి । 2025




అమ్మ భాష తప్పనిసరి

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మాతృ భాష సబ్జెక్టు (తెలుగు) తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. - 8లో



సాంస్కృతిక వైభవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతో యాదగిరిగుట్ట క్షేత్రం వైభవాన్ని సంతరించుకుంటోంది. - 8లో



● బ్రహ్మోత్సవాల్లో అంజలి



భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముకుల గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి తిరుకల్యాణం జరిపించారు. ఈవేడుకలకు ప్రముఖ సినీ హీరోయిన్ అంజలి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

\- భూదాన్‌పోచంపల్లి

పాడి రైతులు..

నష్టాల పాలు

- మదర్ డెయిరీలో రెండు నెలలుగా నిలిచిపోయిన సుమారు రూ.24కోట్ల పాల బిల్లులు
- విజయ డెయిరీ, ఇతర ప్రైవేట్ డెయిరీలను ఆశ్రయిస్తున్న రైతులు



సాక్షి, యాదాద్రి: పాడి రైతులకు రెండు నెలలుగా పాల బిల్లులు రాక అరిగోస పడుతున్నారు. మదర్ డెయిరీ, కరీంనగర్ డెయిరీ, విజయ డెయిరీ ఇలా పలు డెయిరీల్లో పాలు పోస్తున్న రైతులకు సకాలంలో బిల్లులు అందడం లేదు. రెండు నెలలుగా మదర్ డెయిరీలోనే సుమారు రూ. 24కోట్ల పాల బిల్లులు నిలిచిపోయాయి.

మదర్ డెయిరీలో పాలశీతలీకరణ కేంద్రాలు	24
పాల సొసైటీలు	435
పాలు పోసే రైతుల సంఖ్య సుమారు	22వేలు
రోజువారీగా వస్తున్న పాలు	60వేల లీటర్లు
మదర్ డెయిరీ విక్రయిస్తున్న పాలు	80వేల లీటర్లు
ప్రైవేట్‌గా డెయిరీ కొనుగోలు చేస్తున్న పాలు	20వేల లీటర్లు

పాలబిల్లులు సకాలంలో రాక రైతులు మదర్‌డెయిరీని వదిలి విజయ డెయిరీ, ఇతర ప్రైవేట్ డెయిరీలలో పాలు పోస్తున్నారు. గత సంవత్సరం 24 వేల మంది పాడి రైతులు 80 వేల లీటర్ల పాలు పోస్తే, ప్రస్తుతం 22 వేల మంది రైతులు 60 వేల లీటర్ల పాలు పోస్తున్నారు. ప్రస్తుతం మదర్ డెయిరీ సుమారు 80 వేల లీటర్ల పాలు విక్రయిస్తోంది. మదర్ డెయిరీ రైతులకు నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. డిసెంబర్ 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఐదు బిల్లులు రైతుల ఖాతాల్లో రూ.20 కోట్లు జమ చేయాల్సి ఉంది.

మదర్‌డెయిరీకి సంబంధించి పాల ఉత్పత్తి దారులు, పోస్తున్న పాలు

సంవత్సరం	పాలఉత్పత్తి దారుల సంఖ్య	పోస్తున్న పాలు (లీటర్లలో)
2020	32,000	1,00,000
2021	30,000	56,000
2022	27,500	55,000
2023	25,500	57,000
2024	24,000	80,000
2025	22,000	60,000

బిల్లులు రాక పెరుగుతున్న అప్పులు

పాడి పశువులకు ఇచ్చే పల్లీచెక్క, మక్కపిండి, పత్తిచెక్క, తవుడు, కాల్షియం, నాణ్యమైన గడ్డి ధరలు, పెంపకం, వైద్యం, కూలీల ఖర్చులు పెరిగాయి. దీంతో అప్పు చేసి తెచ్చిన పాడి పశువులను రైతులు కోతకు విక్రయిస్తున్నారు. మదర్‌డెయిరీ క్రమం తప్పకుండా బిల్లులు ఇస్తే పెట్టుబడులు పోను గిట్టుబాటు అయ్యేదని రైతులు పేర్కొంటున్నారు. కొన్ని పాల సంఘాలు మాత్రం తమ రైతులకు ఒకటి, రెండు నెలల బిల్లులు సొసైటీల వాటాధనం నుంచి చెల్లిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ విజయ డెయిరీకి సంబంధించి రెండు నెలలుగా నాలుగు బిల్లులు సుమారు రూ.3.20కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతిరోజు సుమారు 15 వేల లీటర్ల పాలను 1800 మంది రైతులు పోస్తున్నారు. లీటరు పాలపై ఇచ్చే రూ.4 ప్రోత్సాహకం మదర్, విజయ డెయిరీల్లో రావడం లేదు.

పెట్టుబడి పెట్టలేక పాడి పశువులను అమ్ముకున్నా



గత రెండు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదు. దీంతో పశువులకు దాణా, పశుగ్రాసం అప్పులు చేసి కొనాల్సి వస్తుంది. పెట్టుబడి పెట్టలేక ఇప్పటికే నాకు ఉన్న నాలుగు పశువుల్లో రెండు పశువులను విక్రయించాను. పాడి రైతులకు బిల్లులు చెల్లించే విషయంలో ఆలస్యం చేయడం సరైనది కాదు. పాలకవర్గం స్పందించి ప్రతి 15 రోజులకు ఒకసారి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

\- కాకల్ల ఉప్పలయ్య, పాడి రైతు, రాజాపేట

నష్టాలతో సర్దుబాటు కావడంలేదు

తీవ్రమైన ఆర్థిక నష్టాలతో రైతులకు పాల బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. డిసెంబర్ నెల రెండో బిల్లు నుంచి రూ.20 కోట్ల పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బ్యాంకు వడ్డీలు, ఉద్యోగుల జీతాలు, మెయింటెనెన్స్ భారంగా మారింది. ప్రతినెలా వస్తున్న నష్టాలను తగ్గించే చర్యలు ప్రారంభించాం. వీలైనంత త్వరగా రైతులకు పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు చెల్లిస్తాం. డెయిరీ ఉద్యోగులకు కూడా జనవరి నెల సగం జీతమే ఇచ్చాం.

\- గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

గోవర్ధనగిరిధారిగా లక్ష్మీనారసింహుడు



ఆలయ మాడ వీధుల్లో శ్రీస్వామి వారిని సింహ వాహనంపై ఊరేగిస్తున్న అర్చకులు, సిబ్బంది

- వైభవంగా కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు
- నేడు ఎదుర్కోలు ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న అర్చకులు



గోవర్ధనగిరి అలంకార సేవ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా జరుగుతున్నాయి. ఆలయంలో గురువారం ఉదయం నిత్య పూజలు చేపట్టారు. అనంతరం అలంకార సేవను ఆలయ తిరు మాడ వీధిలో ఊరేగించారు. అదేవిధంగా ఉదయం శ్రీనృసింహస్వామి వారిని గోవర్ధనగిరిధారి అలంకర సేవలో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయంలో ఆచార్యులు, రుత్వికులు, పారాయణీకులు ప్రబంధ పారాయణం, మూల మంత్ర జపములు, నిత్యారాధనలు కొనసాగించారు. రాత్రి సమయంలో శ్రీస్వామి వారు ఉగ్రనారసింహుడిగా సింహ వాహనంపై విహరించారు. వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అధికారులు, పారాయణీకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారిని జగన్మోహిని అలంకార సేవలో ఊరేగిస్తారు. అదేవిధంగా రాత్రి సమయంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ అర్చకులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

భూదాన్‌పోచంపల్లిలో త్రిఫ్ట్ సర్వే



భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో సర్వే చేస్తున్న అధికారి

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలో గురువారం చేనేత జౌళిశాఖ అధికారులు నేతన్న పొదుపు పథకం(త్రిఫ్ట్) కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. ఆయా కాలనీల్లో చేనేత కార్మికుల గృహాలకు వెళ్లి మగ్గాలు నేస్తున్నారా.. అనుబంధ కార్మికులు ఏయే పనులు చేస్తున్నారని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఓ మాట్లాడుతూ.. నేతన్న పొదుపు పథకానికి పోచంపల్లిలో మగ్గం నేసే కార్మికులు, అనుబంధ కార్మికులు కలిపి మొత్తం 3180 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. గత రెండు రోజులుగా ఇంటింటా తిరిగి 1480 దరఖాస్తులకు సంబంధించి సర్వే పూర్తి చేశామన్నారు. మరో మూడు రోజుల్లో మిగిలిన లబ్ధిదారుల సర్వే పూర్తి చేయనున్నట్లు చెప్పారు. నిజమైన కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే క్షేత్ర స్థాయి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన డీఓ, ఏడీఓలు, సీడీలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్: 2035నాటికి చౌటుప్పల్ పట్టణంలో 2లక్షల మంది నివాసం ఉండనున్నారని, అందుకే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలో నెలకొన్న వివిధ సమస్యలు, వాటి పరిష్కారంతోపాటు అభివృద్ధిపై గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ప్రభుత్వ స్థలాలను గుర్తించాలన్నారు. పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను ప్రథమ ప్రాధ్యాన్యతగా విస్తరించాలని తెలిపారు. 100, 80, 50ఫీట్ల వెడల్పుతో రోడ్లు ఉండాలని చెప్పారు. చిన్నకొండూర్ రోడ్డు 80, వలిగొండ రోడ్డు, తంగడపల్లి రోడ్డు 100 ఫీట్లుగా ఉండాలన్నారు. సర్వీస్‌రోడ్లు శాస్త్రీయంగా నిర్మాణం జరగాలని సూచించారు. ఊర చెరువు అలుగు, వరదనీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు అవసరమైన కాలువ కోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికార యంత్రాంగం అభివృద్ధి పనుల ప్రణాళికలు రూపొందించాలని, అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, డీఈ మనోహర, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

భువనగిరి: జిల్లాలో 2025 సంవత్సరానికిగాను వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1వ తేదీ నుంచి 31 వరకు 12 నుంచి 14 సంవత్సరాల గల బాలబాలికలకు వేసవి ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు సీనియర్ క్రీడాకారులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. సీనియర్ క్రీడాకారులు, జాతీయ స్థాయి క్రీడాకారులు వారి ప్రగతికి సంబంధించి ధ్రువపత్రాలు జత చేయాలని తెలిపారు. ఏదైనా ఒక క్రీడలో మాత్రమే శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 17వ తేదీలోపు సమర్పించాలని, వివరాలకు 83099 92451 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలకు ఏకాగ్రత అవసరం

- కలెక్టర్ హనుమంతరావు



బొందుగుల గ్రామంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

రాజాపేట: విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం రాజాపేట మండలం బొందుగుల గ్రామంలోని ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించే ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రిలో డ్రైడే సానిటేషన్ నిర్వహించాలని ఎండీఓకు సూచించారు. రాజాపేట ఆస్పత్రికి వచ్చిన గర్భిణిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తే అక్కడి సిబ్బంది ప్రవర్తించిన తీరుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్వర్ణగిరి క్షేత్రంలో తిరుప్పావడ సేవ



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామివారికి తిరుప్పావడ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో సుప్రభాతసేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్ర స్వామివారికి మాడ వీధుల్లో తిరువీధి ఉత్సవ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాక చైర్మన్ మానేపల్లి రామారావు, ధర్మకర్తలు మురళీకృష్ణ, గోపికృష్ణ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేకున్నా వైద్యం!

- రిజిస్ట్రేషన్ ఒకరి పేరు మీద.. వైద్యం చేసేది మరొకరు
- ఆస్పత్రులను గుర్తించి సీజ్ చేసిన వైద్యశాఖ అధికారులు
- మూడు నెలలు తిరగకుండానే తిరిగి యథావిధిగా కొనసాగిస్తున్న యాజమాన్యాలు
- శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



తుర్కపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు (ఫైల్)

భువనగిరి: జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో చాలా వరకు అర్హత లేకున్నా వైద్య సేవలందిస్తున్నాయి. తాజాగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో దాడులు చేసి అర్హత లేని వారిని గుర్తించారు. ఈ నెల 5న యాదగిరిగుట్ట, తుర్కపల్లి, బొమ్మలరామారం మండల పరిధిలో పలు ఆస్పత్రుల్లో దాడులు నిర్వహించి సీజ్ చేశారు. కానీ సీజ్ చేసిన రెండు, మూడు నెలలకే ఆస్పత్రులకు చెందిన యాజమాన్యాలు తిరిగి యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఇలాంటి వారిపై వైద్యశాఖ అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

జిల్లాలో సుమారు 160 వరకు అనుమతి పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ప్రైవేట్ ఆస్పత్రి ఏర్పాటు చేసుకునేందుకు ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు అర్హులుగా ఉంటారు. వీరి పేరుమీదనే రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతి పొందాలి. వారే వైద్య సేవలందించాలి. థియేటర్ అసిస్టెంట్ కోర్సు చేసిన వారే ఆపరేషన్ థియేటర్‌లో పనిచేయాలి. అనుమతి పొందిన సంఖ్య మేరకు పడకలను ఏర్పాటు చేసుకోవాలి. ఎంఎల్‌టీ కోర్సు పూర్తిచేసిన వారినే ల్యాబ్‌లో నియమించుకోవాలి. అర్హత గల పారామెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు కాకుండా మరొకరు వైద్య సేవలందిస్తున్నారు. అర్హత గల పారామెడికల్ సిబ్బంది, ల్యాబ్ అసిస్టెంట్లను నియమించుకోవడం లేదు. ఏ ఆస్పత్రి ఎదుట సర్వీస్ చార్జీల పట్టికను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. తుర్కపల్లి, మాదాపూర్ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో అర్హత లేని వారు వైద్య చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా బొమ్మలరామారం, మోత్కూర్, తుర్కపల్లి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట ప్రాంతాల్లో లింగ నిర్ధారణ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పలు ఆస్పత్రుల్లో అర్హత లేని వారు సైతం ప్రసవాలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇదే మాదిరిగా జిల్లాలో చాలా వరకు ఇలాంటి పరిస్థితి నెలకొంది. కేవలం దాడులు మాత్రమే కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాడులు చేస్తున్నాం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో అర్హత లేకుండా వైద్యం అందిస్తున్నట్లు గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటున్నాం. తాజాగా యాదగిరిగుట్ట, తుర్కపల్లి వంటి మండలాల్లో దాడులు నిర్వహించి అర్హత లేకున్నా వైద్య సేవలందిస్తున్నట్లు గుర్తించాం. అర్హత, అనుమతి లేకుండా ఆస్పత్రులను నిర్వహిస్తే డీఆర్‌పీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటాం.

\- మనోహర్, డీఎంహెచ్‌ఓ

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎండీ అవైస్ చిస్తి

భువనగిరిటౌన్ : గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవైస్ ఉర్ రెహమాన్ చిస్తి అన్నారు. గురువారం భువనగిరి పట్టణ కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. గ్రామపంచాయతీల నుంచి గ్రంథాలయ సెస్ వసూలు చేయాలని తెలిపారు. గ్రంథాలయాల్లో నూతన సభ్యులను చేర్పించాలని పేర్కొన్నారు. మోత్కూరు, బొమ్మలరామారం శాఖ గ్రంథాలయాలకు నూతన ఫర్నిచర్ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అన్ని గ్రంథాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. ప్రతి గ్రంథాలయంలో ఆన్ డిమాండ్ రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో గ్రంథపాలకులు, ఉద్యోగులు, పార్ట్ టైం వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

సెకండియర్ పరీక్షలకు 5,515 మంది హాజరు



భువనగిరి పట్టణంలోని ఎస్ఎస్ఆర్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

భువనగిరి: ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో తెలుగు, ఉర్దూ, హిందీ, సంస్కృతం పేపర్- 2 పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు మొత్తం 5690 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5515 మంది హాజరయ్యారు. 175 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు.



భువనగిరి పట్టణంలోని ఎస్ఎస్ఆర్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

నేడు ఎస్ఆర్టీఆర్ఐలో జాబ్‌మేళా

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ(ఎస్ఆర్టీఆర్ఐ)లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్త్రీలకు రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల, కొంగరకలాన్‌లోని ప్రముఖ మొబైల్ కంపెనీలలో, పురుషులకు ఏపీలోని తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ప్రముఖ ఏసీ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పదో తరగతి, ఆపై చదివిన వారు అర్హులని అన్నారు. ఎంపికైన స్త్రీ, పురుషులకు రూ.14,500 నుంచి రూ.16,500 జీతం, ఉచిత బస్సు, భోజన సదుపాయం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామని, ఆసక్తి కల్గిన వారు విద్యార్హతల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 994846111, 7540084221ను సంప్రదించాలని సూచించారు.

తిరుమలగిరి మార్కెట్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చామంతి

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎల్సోజు చామంతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లుగా రాములు, రాములు, ఉప్పలయ్య, సైదులు, అంజయ్య, వేణుగోపాల్‌రావు, ఎం.డి.హాఫీజ్, జలేందర్, వాసుదేవరెడ్డి, సోమేష్, రమేష్ బాధ్యతలు చేపట్టారు.

10న అప్రెంటిస్‌షిప్ మేళా

నల్లగొండ: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్ల అభ్యర్థులకు ఈ నెల 10న నల్లగొండలోని ప్రభుత్వ ఐటీఐ (పాత) కళాశాలలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సింహాచారి తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

కోర్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కోర్టులో న్యాయ సేవాధికార సంస్థలో ఉద్యోగాల భర్తీకి సంస్థ చైర్మన్ ఎం.నాగరాజు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఖాళీగా ఉన్న టైపిస్ట్/అసిస్టెంట్(2) పోస్టులకు మార్చి 7 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

విశ్వ ఉనికి రహస్యం భౌతికమే

- ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కవి కిషోర్


మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ కవి కిషోర్

నల్లగొండ టూటౌన్: విశ్వ ఉనికి రహస్యం భౌతికమే అని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కవి కిషోర్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సైన్స్ విభాగం ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి వైజ్ఞానిక దృష్టిని అలవర్చుకొని జీవన విధానములో అన్వయించుకోవాలన్నారు. సమాజంలో ఎదురయ్యే అనేక సవాళ్లకు సైన్స్ ద్వారా పరిష్కార మార్గాలను కనుగొనాలన్నారు. విశ్వ రహస్యాలను శాస్త్రవేత్తలు ఇప్పటికీ కేవలం 30 శాతం మాత్రమే విశ్లేషించగలిగారని అన్నారు. మానవుల్లో కొంత శాతం మేర జంతువుల జన్యులతో పోలిన జన్యువులు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారని వివరించారు. మానవ స్వభావాలు అనేకం జన్యు ప్రేరేపితంగా ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, అన్నపూర్ణ, దోమల రమేష్, కళ్యాణి, రూప, రామచందర్‌గౌడ్, జ్యోతి, శివరాం పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE X ADLL CHIEF CIVIL JUDGE, HYDERABAD DISTRICT:: AT: CHETHABAZAR
OS.NO. 79 OF 2025
BETWEEN:
Baddam Neeraja and Others ....Petitioner/Plaintiff
And
The Tashildar, Saidabad Mandal, Hyd Dist.
The Tashildar, Addagudur Mandal
Yadadri Bhongiri Dist. ...Respondents/Defendants
To,
Whomsoever it may concern
(All Concerned)
PUBLIC NOTICE
The Petitioner/plaintiff has filed the above suit for declaration/declaring the plaintiffs as the absolute owners and possessors of suit schedule property being the legal heirs of the deceased sri. **Baddam Sudhakar Reddy.** Plaint presented under order VII rule 1 to 6 R/w section 26 of CPC. The Plaintiffs be Any concern Person or persons claiming below scheduled property of above named may present before above said Court on 02/4/2025 at 10:30 along with related documents or else this Hon'ble court may take appropriate steps for further proceedings as per law.
SCHEDULE 'A' PROPERTY
All that the House bearing H.No. 16-1-523/11, admeasuring about 143 sq. yards, consisting of 2 rooms and 1 tin shed situated at saidabad, Hyderabad, Telangana Bounded by:- East : House No. 16-1-523/10/3, West : Road, North : House bearing No. 16-1-523/12 South : 11 wide lane.
SCHEDULE 'B' PROPERTY
All that the Southern Portion of House bearing Municipal H.No. 16-1-24/33-3RT, admeasuring about 106.66 sq. yards or equivalent to 89.16 sq. mts out of 266.00 S.q, situated at A.P. Housing Board Colony, Saidabad, Hyderabad, Telangana Bounded by:- North : Northern Portion of H.No. 16-1-24/33-3RT, South : Road, East : M.I.G. House No. 32/3RT, West : Road.
SCHEDULE 'C' PROPERTY
All that the Double Storied Building bearing Municipal No. 17-2-574/1, admeasuring 191.00 Sq. Yards or equivalent to 160.44 Sq. mts, situated at Kurmaguda, Hyderabad, Telangana Bounded by:- North : Neighbour's House, South : Neighbour's House, East : Road, West : Neighbour's House.
SCHEDULE 'D' PROPERTY
All that the Agriculture Land Bearing Sy No. 658ఆ, admeasuring Ac. 2.00 gts, situated Addagudur Village and Mandal, Yadadri Bhuvanagiri Dist, Telangana Bounded by:- North : Agriculture land of Yanala Janaiah, South : Agriculture land of K. Amrutha Reddy, East : Agriculture land of K. Srinivas Chary & others, West : Agriculture land of K. Amrutha Reddy
(BY ORDER OF THE COURT)
K. Sravan Kumar Reddy, A.Srikanth, Advocates, Phone:- 7396272177.

SHREE SWAMINARAYAN GURUKUL INTERNATIONAL SCHOOL SURYAPET
since 1948
8th & 9th - March 2025 and 15th & 16th - March 2025
Walk in Interview
PRT, TGT, PGT & School Staff
CBSE : For I to X
Dear Teachers & Staff : Join with Prestigious Organization and Grab this Great Opportunity
We invite experienced teachers with good Subject Knowledge, Spoken English to train the next generation students with the latest methodologies in CBSE orientation
Mother Teachers I & II Classes with 2-3 years experience
Female Teachers I to V Classes (All Subjects) with 3-4 years experience
Male Teachers VI to X Classes (All Subjects) with 4-5 years experience
PET, Music, DTP Operators, PRO, Supervisors, Board Incharges
E-MAIL Resume to principalsyp@gurukul.org (or) 88 844 844 21
Come along with original certificates on 8th & 9th - March 2025 and 15th & 16th - March 2025
Dates & Timings : 8th & 9th - March 2025 and 15th & 16th - March 2025 / 9:00 AM to 3:00 PM
Address: NH 65, Swaminarayan Eco Township, Near Durajpalli, Undrugonda, Chivvemla Mandal Suryapet-508213
Contact: 91 88 844 844 21 & 91 88 844 844 26

సాక్షి క్లాసిఫైడ్స్

Education
BA/B.Com/B.Sc/ BBA / BBM/ Diploma / MA / M.Com/ M.Sc/ MBA / MCA/ B.Tech / D.Pharmacy/ B. Pharmacy/ LLB/ BAMS / BHMS పూర్తి చేయండి © 99895 30727 [B-755673]

Services
NAME CHANGE
I. G. RAJANI D/o BAL REDDY, B.Sc., B.Ed., House Hold, shall henceforth be known as "SOMIDI RAJINI W/o SOMIDI RAVINDER REDDY" Cell : 9885095823 [SCA25002027]

Wanted
Wanted Experienced Teachers : All Subjects (B.Ed Must, English Proficiency) & Receptionist. Vishishta School, Shivaji Nagar, Nalgonda. Cell: 8885402344 [SCA25002030]

Real Estate
LAND FOR SALE
విజయవాడ హైవేకు కిలోమీటర్ దూరంలో కట్టంగూరు నుండి నల్లగొండకు వెళ్ళే మార్గంలో రోడ్డుకు రెండవ బిట్టు 3 ఎకరాల భూమి అమ్మకమునకు కలదు. కావలసినవారు సంప్ర॥ 8866649111 [YA-15871]

HOUSE FOR SALE
2,3 & 4BHK లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉన్నాయి. రూ. 80 లక్షల నుండి, డి-మార్ట్ పక్కన, మిర్యాలగూడ. ఆధునిక సౌకర్యాలు, క్లబ్స్, స్విమ్మింగ్ పూల్. సంప్ర : 7013578378 [HA-1221]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకు లను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అమ్మ భాష తప్పనిసరి

- అన్ని పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టు బోధించాల్సిందే..
- ఎన్‌సీఈఆర్‌టీ ఆదేశాలతో ప్రభుత్వ నిర్ణయం

తిరుమలగిరి (తుంగతుర్తి): అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మాతృభాష (తెలుగు) సబ్జెక్టు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో సీబీఎస్‌ఈతో పాటు ఇతర సిలబస్‌ను అమలు చేస్తూ మాతృభాషను పక్కన పెడుతున్నారు. దీంతో విద్యార్థులు మాతృభాషపై పట్టు కోల్పోవడమే కాదు కనీసం చదవడం కూడా రావడం లేదని గ్రహించిన ఎన్‌సీఈఆర్‌టీ తెలుగు సబ్జెక్టు తప్పనిసరిగా బోధించేలా చేయాలని ఆదేశించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేస్తూ అన్ని పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేసింది.



అధిక మార్కుల కోసం..

ఇప్పటి వరకు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు మినహా చాలా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టును బోధించడం లేదు. సీబీఎస్‌ఈ, ఐబీహెచ్‌ఈ తదితర సిలబస్‌ను అమలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలు భాష ఎంపిక స్థానంలో విద్యార్థులకు ఎక్కువ మార్కులు వచ్చేలా సంస్కృతం, అరబిక్ బోధిస్తున్నారు. దీంతో తెలుగులో భావ వ్యక్తీకరణ, సృజనాత్మకతను కోల్పోతున్నట్లు భాషాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

ముందు తొమ్మిదవ తరగతికి..

ఇప్పటి వరకు ఉన్నత తరగతులకు తెలుగు పాఠ్యాంశాలు అమలు చేయని పాఠశాలలకు తప్పనిసరిగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతికి, 2026–27 నుంచి 10వ తరగతికి అమలు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



విద్యార్థులు మాతృభాషపై పట్టు కోల్పోతున్నారు. కొంత మంది విద్యార్థులు తెలుగు వ్యాక్యాలు రాయలేని స్థితిలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితిలో మాతృ భాష అయిన తెలుగును కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం.

– రాజు, తెలుగు ఉపాధ్యాయుడు, తిరుమలగిరి

పరీక్షలు సరిగా రాయలేకపోతున్నానని..

- ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కోదాడ రూరల్: పరీక్షలు సరిగా రాయలేకపోతున్నాననే మనస్తాపంతో ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండకు చెందిన బచ్చలకూర శంకర్ కుమార్తె నవ్య పెన్‌పహాడ్ మండలం అనాజిపురంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న నవ్య.. ఇంటి వద్ద నుంచే బుధవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ మొదటి పరీక్షకు హాజరై తిరిగి వచ్చింది. జ్వరంతో పరీక్షలు సరిగ్గా రాయలేకపోతున్నాని మనస్తాపం చెందిన నవ్య గురువారం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి చూసేసరికి మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

రూ.2వేల కోట్లకు చేరువలో రుణాల పంపిణీ

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రుణాల పంపిణీ రూ.2వేల కోట్లకు చేరుకుందని బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీసీసీబీలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.580కోట్ల బంగారు రుణాలు, రూ.571 కోట్ల పంట రుణాలు, రూ.405 కోట్ల మార్టిగేజ్ రుణాలు, రూ.379 కోట్ల దీర్ఘకాలిక రుణాలు అందించినట్లు తెలిపారు. బ్యాంకు వ్యాపారం రూ.3వేల కోట్లకు చేరువలో ఉండగా, రూ.50 కోట్ల లాభాల దిశలో డీసీసీబీ పయనిస్తుందన్నారు. రైతుల ప్రయోజనాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో గృహ రుణాలను సులభతరం చేశామని, పొల్ట్రీ రుణాల చెల్లింపు కాల పరిమితిని పెంచామన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద అదనపు రుణాలను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో సీఈఓ శంకర్‌రావు, డైరెక్టర్లు లింగం యాదవ్, పాశం సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సైదయ్య, కోడి సుష్మ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- రెండు రోజుల క్రితం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నాపైన బాలుడు
- మూడు ప్రత్యేక పోలీస్ బృందాలతో గాలింపు
- నకిరేకల్‌లో కిడ్నాపర్‌ని పట్టుకుని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


బాలుడితో పోలీసులు

నల్లగొండ, నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజుల క్రితం కిడ్నాపైన మూడేళ్ల బాలుడి ఆచూకీని పోలీసులు కనిపెట్టారు. నకిరేకల్‌లో కిడ్నాపర్‌ని పట్టుకొని అతడి చెర నుంచి బాలుడిని విడిపించి గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన షమీమున్సీసా, హైమద్ దంపతులకు ఇద్దరు సంతానం. వీరు గత మూడేళ్లుగా నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వాటర్ ట్యాంక్ కింద నివాసముంటూ అక్కడే ఏర్పాటు చేసిన రూ.5 భోజనం తింటూ జీవనం సాగిస్తున్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన సీతారాములు చెల్లెలికి ముగ్గురు కుమార్తెలు కాగా.. మగ పిల్లలు లేరని ఆమె బాధపడుతుండడంతో చూడలేక సీతారాములు వారం క్రితం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి అక్కడ ఏ ఆధారం లేకుండా జీవనం సాగిస్తున్న హైమద్ కుటుంబాన్ని చూశాడు. వారితో పరిచయం పెంచుకొని వారి కుమారుడిని మంగళవారం రాత్రి కిడ్నాప్ చేసి నకరేకల్‌లో ఉంటున్న తన చెల్లెలికి అప్పగించాడు. తమ కుమారుడు కనిపించకపోవడంతో హైమద్ దంపతులు నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి బాలుడిని కిడ్నాప్ చేసిన వ్యక్తిని పట్టుకోవాలని ఆదేశించారు. దీంతో పోలీసు బృందాలు రెండు రోజులుగా గాలించి సీతారాములు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతడు నకరేకల్‌లో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. గురువారం అతడిని అరెస్ట్ చేసి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

నిందితుడికి 31 ఏళ్లు జైలు శిక్ష

- బాలికపై అత్యాచారం కేసులో తీర్పు వెలువరించిన సూర్యాపేట జిల్లా కోర్టు

చివ్వెంల(సూర్యాపేట): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 31 ఏళ్లు జైలు శిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు స్పెషల్ సెషన్స్ జడ్జి ఎం. శ్యామ్‌శ్రీ గురువారం తీర్పు వెలువరించారు. ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్త చనిపోవడంతో ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడిని పోషించుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గుంజ వెంకన్న అప్పుడప్పుడు సదరు మహిళ ఇంటికి వచ్చి వెళ్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆమె చిన్న కుమార్తెపై అతడి కన్నుపడింది. బాలికపై పలుమార్లు వెంకన్న అత్యాచారానికి పాల్పడ్డాడు. 2021 మార్చి 31న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చి ఆమెకు గర్భస్రావ మాత్రలు ఇచ్చాడు. అదే రోజు మళ్లీ అత్యాచారం చేశాడు. బాలికకు కడుపునొప్పి రావడంతో హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో కడుపునొప్పి ఎక్కువై కడుపులోంచి పిండం బయటపడింది. బాలికను తల్లి నిలదీయగా.. గుంజ వెంకన్న తనపై అత్యాచారం చేస్తున్నాడని విషయం చెప్పింది. బాలికకు చికిత్స చేయించిన అనంతరం 2021 ఏప్రిల్ 2న ఆమె తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి డీఎస్పీ మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి 31 ఏళ్లు జైలు శిక్షతో పాటు రూ.30 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అదేవిధంగా బాలికకు రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సహకరించారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన ముగ్గురు అరెస్ట్

వేములపల్లి(మాడ్గులపల్లి): వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన అతడి భార్యతో పాటు మరో ఇద్దరిని గురువారం మాడ్గులపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన నక్క వెంకన్న, సరిత భార్యాభర్తలు. వీరికి 14 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సజావుగా సాగుతున్న వీరి కాపురంలో మనస్పర్థలు రావడంతో సరిత భర్త వెంకన్నకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో వెంకన్న పలుమార్లు సరితను కాపురానికి రావాలని అడిగగా ఆమె రాకపోవడమే కాకుండా కుక్కడం గ్రామానికి చెందిన ఊరుబిండు మల్లయ్యతో వివాహేతర సంబంధం పెట్టుకొని భర్త వెంకన్నను ఇబ్బందులకు గురిచేశారు. సరిత మేనమామ మన్నెం శ్రీను సైతం ఆమెకు సహకరించడంతో మనస్తాపానికి గురైన వెంకన్న గత నెల 22న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భార్య సరిత, ఊరుబిండు మల్లయ్య, మన్నెం శ్రీను వేధింపుల కారణంగానే తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వెంకన్న సూసైడ్ లెటర్ సైతం రాశాడు. మృతుడి తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం వెంకన్న భార్య సరితతో పాటు మల్లయ్య, శ్రీనును అరెస్ట్ చేసి మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు వారికి 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

అగ్నివీర్ ఇండియన్ నేవీ ఉద్యోగాలకు ఎంపిక

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామయ్య డిఫెన్స్ అకాడమీలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అగ్నివీర్ ఇండియన్ నేవీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అకాడమీలో మొదటి సంవత్సరం డిఫెన్స్ కోర్సు చదువుతున్న మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఎస్. అభిషేక్, సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రానికి చెందిన కె. ప్రదీప్ జూలై నెలలో నిర్వహించిన ఇండియన్ నేవీ అగ్నివీర్ సీనియర్ సెకండరీ జాతీయస్థాయి పరీక్షలో ప్రతిభ చాటి ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగం సాధించిన విద్యార్థులను అకాడమీ డైరెక్టర్ రామయ్య, శ్రీనివాస్, అధ్యాపకులు నగేష్, బొమ్ము శంకర్ అభినందించారు.

పాడి ఆవులు విక్రయిస్తామని టోకరా

- వాట్సాప్‌లో ఆవుల ఫొటోలు పెట్టి రూ.85,500 కొట్టేసిన దుండగుడు

భువనగిరి: వాట్సాప్‌లో ఫొటో పెట్టిన ఆవులను కొనుగోలు చేసేందుకు ఓ వ్యక్తి రూ.85వేలు పంపి మోసపోయాడు. ఈ ఘటన భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్‌కు ఈ నెల 5వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి పాడి ఆవుల ఫొటోలు పెట్టి వాటిని అమ్ముతామని చెప్పాడు. వాట్సాప్‌లో పెట్టిన ఆవులలో మూడు మాత్రమే ఎంపిక చేసుకుని ఫోన్‌పే ద్వారా రూ.1,05,000 పంపాలని సూచించాడు. గుర్తుతెలియని వ్యక్తి చెప్పిన మాటలు నమ్మిన ముత్తిరెడ్డిగూడెం వాసి మూడు ఆవులను ఎంపిక చేసుకుని ఫోన్ పే ద్వారా రూ.85,500 పంపాడు. డబ్బులు పూర్తిగా పంపితేనే ఆవులను పంపిస్తామని చెప్పడంతో తాను మోసపోయినట్లు గ్రహించి 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. గుర్తుతెలియని వ్యక్తులు గేదెలు, ఆవులను అమ్ముతామని ఫోన్ చేస్తే నమ్మవద్దని ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు.

ఎమ్మెల్యేకు బెదిరింపు కాల్‌పై విచారణ వేగవంతం

- నిందితులను పట్టుకునేందుకు మధ్యప్రదేశ్‌కు వెళ్లిన నకిరేకల్ పోలీసులు

నకిరేకల్: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించిన కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఎమ్మెల్యేకు వచ్చిన ఫోన్ నంబర్ మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి విమానంలో నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ లచ్చిరెడ్డి తమ సిబ్బందితో కలిసి మధ్యప్రదేశ్‌కు పయనమయ్యారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కారు ఢీకొని యువకుడు మృతి


సూర్యప్రసాద్(ఫైల్)

బీబీనగర్: బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి బీబీనగర్ మండలం నాగిరెడ్డిపల్లికి వెళ్లే దారిలో జరిగింది. సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన పెరుమాండ్ల సూర్యప్రసాద్(24) బుధవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో బీబీనగర్ నుంచి బైక్‌పై బ్రహ్మణపల్లికి వెళ్తుండగా.. నాగిరెడ్డిపల్లికి వెళ్లే దారిలో హిందుస్థాన్ శానిటరీ వేర్ పరిశ్రమ గోడౌన్ సమీపంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు భానుచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నృసింహుడి సన్నిధిలో సాంస్కృతిక వైభవం


భూదాన్‌పోచంపల్లి: భజన కీర్తనలు ఆలపిస్తున్న పుండరీక భక్త సేవా సమాజం సేవకులు


యాదగిరిగుట్ట: నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు సరికొత్త వైభవాన్ని సంతరించుకున్నాయి. గురువారం ఉదయం భూదాన్‌పోచంపల్లికి చెందిన శ్రీపుండరీక భక్త సేవా సమాజం, యాదగిరిగుట్టకు చెందిన శ్రీభాగ్యలక్ష్మీ మహిళ భజన మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆస్థాన మంగళ వాయిద్యం, ఆస్థాన వైదిక ప్రార్థన చేపట్టారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన ఏకే శ్రీనివాసాచార్యులు భగవత్ భక్తులు, వారిని భగవానుడు రక్షించిన విధానంపై ఉపన్యాసం చేశారు. ఏపీలోని తాడేపల్లిగూడేనికి చెందిన ముదపాక బాలసుందరం భగవతార్‌చే విరాటపర్వం అనే హరికథా గానం చేశారు. మధ్యాహ్నం హైదరాబాద్‌లోని స్మరణ డ్యాన్స్ అకాడమీ బృందంచే నిర్వహించిన భరతనాట్యం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన మహతి ఆర్ట్స్, వింజమూరి లక్ష్మీ బృందం, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఫైన్ ఆర్ట్స్ బృందంచే భక్తి సంగీతం నిర్వహించారు. సాయంత్రం సుముఖి నృత్యాలయం వరలక్ష్మీ బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన కొనసాగింది. తిరుమల తిరుపతి ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సాయంత్రం అన్నమాచార్య సంకీర్తన విభావరి నిర్వహించారు.

యాదగిరిగుట్ట క్షేత్రంలో యూపీ సీఎం సురక్ష టీం


యాదగిరిగుట్ట ఆలయ మాడ వీధిలో యూపీ సీఎం సురక్ష టీం పోలీసులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సీఎం సురక్ష టీంకు చెందిన పోలీసు బృందం గురువారం సందర్శించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ(ఐబీటీఏ)లో శిక్షణ తీసుకుంటున్న యూపీ సురక్ష టీంకు చెందిన 51 మంది పోలీసు బృందం.. ఆలయాల్లో భద్రత, సీఎంతో పాటు ప్రముఖులు ఆలయాలను సందర్శించిన సమయాల్లో ఎలా వ్యవహరించాలనే అంశాలపై శిక్షణలో భాగంగా యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చి పరిశీలించారు. ప్రముఖులు వచ్చిన సమయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శనాలకు ఎలా పంపించాలి, ఆలయ పరిసరాల్లో ప్రముఖులు పర్యటిస్తున్న సందర్భంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, బందోబస్తు విషయంలో ఏవిధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలపై ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సీఎం సురక్ష టీంకు వివరించినట్లు సీనియర్ ఆర్ఎస్ఐ శివలాల్ తెలిపారు. వీరి వెంట అధికారులు సాయికుమార్, గణేష్, శంకర్‌రెడ్డి ఉన్నారు.

బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఎదుర్కోలు మహోత్సం, శనివారం తిరు కల్యాణోత్సవం జరగనున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకుగాను గురువారం ఆలయ పరిసరాల్లో, మాడ వీధుల్లో, బస్టాండ్ ప్రాంతాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ టీంలు తనిఖీలు చేశారు.


ఆలయ పరిసరాల్లో తనిఖీలు చేస్తున్న బాంబ్, డాగ్ స్క్వాడ్

రాష్ట్రపతి భవన్‌లో చండూరు చేనేత వస్త్రాల ప్రదర్శన


చేనేత వస్త్రాలను ప్రదర్శిస్తున్న జాతీయ అవార్డు గ్రహీత గంజి యాదగిరి

చండూరు: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహిస్తున్న అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో చండూరుకు చెందిన జాతీయ అవార్డు గ్రహీత గంజి యాదగిరి, జాతీయ మెరిట్ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసులు పాల్గొన్నారు. బుధవారం రాత్రి తాము తయారుచేసిన చేనేత వస్త్రాలను ప్రదర్శించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వివరించారు. అమృత్ మహోత్సవ్ కార్యక్రమానికి తెలంగాణ నుంచి ఎంపికైన 20 మందిలో తాము ఉండడం, రాష్ట్రపతి భవనలో తమ ఉత్పత్తులను ప్రదర్శించడం చాలా ఆనందంగా ఉందని గంజి యాదగిరి, చిలుకూరి శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం


అరుణ్‌కుమార్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెందిన గంధం అరుణ్‌కుమార్(26) దామరచర్ల మండల కేంద్రంలోని నాగకృష్ణ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన పెట్రోల్ బంక్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. ఆ రోజు బంక్‌లో డబుల్ డ్యూటీ చేసిన అరుణ్‌కుమార్ ఆ తర్వాత కనిపించకుండాపోయాడు. రెండు రోజుల పాటు డ్యూటీకి రాకపోవడంతో బంక్ నిర్వాహకులు అరుణ్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. అంతేకాకుండా పెట్రోల్ బంక్‌లో డబ్బుల లెక్కల్లో తేడా రావడంతో వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద యువకుడు ఉరేసుకుని మృతిచెందినట్లు గురువారం ఉదయం పోలీసులు వాట్సాప్ గ్రూపుల్లో ఫొటోలు షేర్ చేయడంతో.. ఆ మృతదేహం అరుణ్‌కుమార్‌దిగా గుర్తించిన అతడి స్నేహితులు వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ చేపడుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు గంధం వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునప్నట్లు ఎస్ఐ తెలిపాడు. అరుణ్‌కుమార్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి ఆర్థిక ఇబ్బందులు అధికమవ్వడంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

మృతదేహంతో ఆందోళన..

అరుణ్‌కుమార్ ఆత్మహత్యకు పెట్రోల్ బంక్ యాజమానే కారణమంటూ అతడి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని నాగకృష్ణ పెట్రోల్ బంక్ వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. బంక్ యాజమాని తమ కుమారుడిని ఇబ్బందులకు గురిచేయడం వలనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న వాడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆదోళనను విరమింపజేశారు.

ఉండ్రుగొండ గుట్టల్లో చెలరేగిన మంటలు

- భయాందోళనలో స్థానిక గ్రామాల ప్రజలు

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం ఉండ్రుగొండ శివారులోని గుట్టల్లో గురువారం మంటలు చెలరేగాయి. దీంతో గుట్టలకు సమీపంలో ఉన్న ఉండ్రుగొండ, దురాజ్‌పల్లి, వల్లభాపురం, మున్యాదాపురం, ఇమాంపేట తదితర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు ప్రమాదం జరిగిన స్థలం పక్కనే హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఉండటంతో బిక్కుబిక్కుమంటున్నారు. స్థానిక గ్రామాల ప్రజలు అగ్రిమాపక సిబ్బందికి సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి వెళ్లిన ఫైర్ సిబ్బంది మంటలు తీవ్రంగా ఉండడంతో రాత్రివేళ చేసేదేమీ లేక వెనుదిరిగి వచ్చారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ అధికారి కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. పశువుల కాపరులు చుట్ట లేదా బీడీలు తాగి పడేయడంతో ఎండిన ఆకులకు నిప్పు అంటుకొని మంటలు చెలరేగి ఉండవచ్చని పేర్కొన్నారు. అగ్నిమాక సిబ్బంది మంటలు వచ్చే ప్రదేశానికి వెళ్లేందుకు వీలుకావడం లేదన్నారు.